దెసనుంచి తల్లి చేతులెత్తి మొక్కింది. మూడోగుప్పిలెత్తి ఏట్లో విసరబోయేలో పోలీసన్న చుట్టివచ్చి ఫిర్యాదీనాపి "ఉత్తభోగి పిడకలంట్రా!" అంటూ ఆయువకుణ్ణి టెక్కుపోతూ నెట్టుకు పోయాడు.

నావమీద బుల్లయ్య తాను నావికుడా? నాయకుడా? అన్నట్టు పిల్లకేసిచూస్తూ తెరచాప ఎత్తాడు ఓ అరమైలు. అరమైలు కాకపోతే పావుమైలు, పావుమైలు లేకుంటే పదిగజాలు.

పిడకలోతే పుడకలున్నాయి
పుడకలోతే తడికెలున్నాయి
తడికెలోతే తనువులున్నాయి
దానిపేరే భోగిమంటా లోనికూరిమి తెలియవే।

అంటూ పాడుకుంటూ చుక్కాని పట్టాడు. తానే లోక నావికుడులా తానే లోకనాయకుడిలా! పక్కావోఝాం! ఝాం కాకపోతే ఓఘడియ! ఘడియ లేకుంటే ఓ విఘడియ!

... ... ... ... ...

## "అనుకోని లవ్! అనుకోని కిస్!"

(కథపేరు మహా కామోద్రేకంగా వుంది. కాని కడకంటా చదివితే తప్పకుండా కన్నీరుగారుస్తారు పాఠకులు!)

విద్యుత్తంతులు విలాసవనాలు విరివైన వీధులూ అన్నీ వున్నా అరవైనాలుఘ్ఘుళ్లూ ఏపట్నం సందడించదు, ఏనగరం తేజరిల్లదు. రాత్రి రెండోఝాం మూడోఝాం మధ్యనో నిర్మానుష్య మనిపించే నిదరలో మునింగివుంటారు ప్రజలంచరూ. నింగికాంతి తప్ప మరో కాంతి ఇండ్లమీదగాని చెట్లమీదగాని గోడలమీదగాని గోదావరిమీదగాని కనబడదు. బహూ ప్రశాంతమనిపిస్తుంది. వ్రాసినంతలోనే యింత ప్రశాంతంగావుంటే అసలు ఆ తరుణంలో

ఆ నగరవాసులు తమర్ని తామెరక్కుండా ఆదమరచే సుషిప్తి సౌఖ్యావ్యాప్తి యొక్క నిజానుభూతి ఎంతని కొనియాడేది ?

ఇలా ఒక ఘడియసేపు మాత్రమే ఆనెమ్మది. ఆరాత్రి తెల్లవారగట్లే ఇంకా సరిగా చెప్పాస్తే తెలతెలవారే, టప్పుడు ఉషారేఖ లవిగో యివిగో అన్నట్టు తూర్పున ఇలకెత్తే అంతలో అయిదారు మేడలమీద అక్కడక్కడ ఆ నగరంలో పడగ్గదుల్లో గడియారాలు మేలుకొలుపు గణగణలు కొట్టసాగినాయి. వెంటనే కిటికీలగుండా విద్యుద్దీపాలు మీటల ఎక్కున, కళకాంతులు విరజిమ్మ మొదలెట్టాయి. మనుష్యులులేచి నడాడినట్టు, మళ్ళీ పరున్నట్టు, మళ్ళీ బద్ధకం బాపికొన్నట్టు, ఏవేవో ధరించినట్టు, ఎక్కడికో ప్రయాణమన్నట్టు, ఇలా పట్నంలో అక్కడక్కడ విశదీకరణమైంది.

అయినా బయల్దేరిన వారిదందరిదీ తలో మూలాను. ఒకరితో ఒకరి కెట్టి సంబంధంలేదు. కలుసుకున్నా పలకరించే రకాల వారుగారు. అసలు ఎరిగుంటేగా పలకరించుకోడానికి. అయినా పలకరించుకోడానికి సావకాశం ఎక్కడ? ప్రదేశం ఎక్కడ? వాళ్లంతా తెల్లారి 6-30 కు బయల్దేరే "డిసెల్" అందుతుందా దాటిపోతుందా అనే తొందరతో పయనించినవాళ్ళే. ఎవరిపని వాళ్ళది! ఓ వూరివాళ్లైనా ఓ పట్నపు వాస్తవ్యులైనా ఒకరితో ఒకరికి జరుగురు వున్నప్పుడే పరిచయం పలకరింపూ అవన్నీని. అలాంటి జరుగురు అందరికీ అన్యోన్యం సర్వసామాన్యంగా వుండడం అసంభవం.

"డిసెల్" అన్నటైముకు ఎప్పుడు ఏగమ్యస్థానం చేరు కుంది కనుక! దానికో విఖ్యాతిగుడు. "డిసెల్" విసురుకలదన్న మాటేకాని "డిసెల్" అంత "డిమోక్రాటిక్"ది మరోటిలేదు. ఆ సందర్భం అంతా బండి స్టేషన్‌లోకి వచ్చాక వివరించుకుందాం! ప్రస్తుతం అది అరగంట ఆలస్యంగాగాని రాదని తీర్మానింప

బడింది. ప్లాట్‌ఫారం మీదకు నెట్టబడ్డ ప్రయాణీకు లందరి చేతాకూడా!

మరి ఆ అరగంటా వాళ్ళందరూ ఏమిటిచేయడం? ఎవరి తీరుబడి 'హొయలు వారు చూపించుకొంటూ, పచారుచేసేవాళ్లు పచారు చేయడం, నిటాగ్గా నిలబడేవాళ్ళు నిటాగ్గా నిలబడ్డం' స్టేషన్‌బల్లలకు జేర్లబడేవాళ్ళు జేర్లబడ్డం, కూర్చుని లోలో కులుకు లాడుకొనేవాళ్లు కులుకులాడుకోవడం—ఇవి తప్పించి ఎవరికీ ఏంపని చేసేందుకు పాలిపోవడంలేదు.

ప్రయాణీకుల్లో కొందరు మొదటి తరగతి టిక్కట్టు తీసికో తగ్గవారున్నారు. కొందరు ఓరసిలగా కూర్చునేవాళ్లున్నారు. సిగ్గు పడి ఇరికిరికి ఒదిగిపొయ్యేవాళ్ళున్నారు. బరితెగి ఆకాశమంత చోటూ తమకే చాల్దనేవాళ్ళున్నారు. ఎవర్నని పేర్కొనేది? ఎందుకని విడమరిచేది? "డిసెల్" వచ్చిందా ఇంతమందీ పాలో మంటా కలగాపులంగా ఎక్కిపోవలసిందే. కుక్కుకు కురూకు ఒకరి నొకరు ముట్టుకుంటూ ముడుచుకుంటూ—ఎందుకు వెక్కి రింపు. అందరూ ఒక్కమాదిరిగానే డబ్బిచ్చి ఒక్కఫక్కీ టిక్కట్టే తీసుకొన్నాం ఎందుకు వెక్కిరింపు—లన్నట్టు ముఖముఖాలు చూచుకోకుండా నిలబడిపోవలసించే.

కాని ఎంతలో ఎంతవింత అన్నట్టు ప్లాట్‌ఫారమ్‌మీది కింకా కొత్తకొత్తవాళ్ళు వస్తూనేవున్నారు. ఉదహరణ కుగ్గడిస్తాను ఓపేరు. "దిమ్నాచి" ఆమెపేరు. రంగుకు మనిషి నలుపే అనుకోండి. తేటకు ఓవ్యాసుందరి. ఉదయనవ్యత అంతా ఆమె చిరునవ్వునే తాండవిస్తూవుంది. తెల్లవారకట్ల ఆమె ముస్తా బవడానికి ఎంతకాలం తీసుకుందోకాని — సఫేదులాంటి తెల్లటి చీర, ఏదో కలర్‌బాడిస్, ఆదోలా ఊగే లోలాకులు—పెళ్ళికానిపిల్ల అని అనడానికి వీల్లేకుండావుంది. ఇల్లాలనడానికి వల్లగాకుండా వుంది—ఎల్లాంటిదైనా ఏమరుపాటునేరని దానిలా అన్ని దిక్కులా

చూస్తూ చెర్లోవిడిచి పొద్దుపొడుపు కెదురుగా శోభిల్లే తెల్లకలవలా-అందులోనూ తెల్లని చీరకట్టిందేమో-మరీ నిజంగా తెల్లకలవలా-మళ్ళీ మాట్లాడనిచ్చిందికాదు వొక్కళ్లనీ అక్కడివాళ్ళను.

ఆమెనుచూస్తూ అప్పుడే చాలామంది అనుకొన్నారు. ఎలా ఎక్కుతుంది ఈమె ఈ 'డిసెల్' కట్టిన చీరకుచ్చెళ్లు చూస్తే అట్టట్టట్టట్టా అంబోధీనుచ్చిళ్లులా మెరసిపోతూవుంది. ఏలా ఎక్కుతుంది ఈమె ?" అని విశాలహృదయులుండరు కొందరు ?—వారు ఆమెకు మునుముందు చోటెట్టాలని తోడ్తోనే సంకల్పించుకోసాగారు.

అయితే అమె వొక్కర్తే అని మనం అనుకోడం ఎట్లా? కూడా మరొకరుండకూడదూ ? ఉండకూడదా అని పదినిమిషాలూహించారు కూడాను కొందరు. కాని ఎవరూకూడా మరొకరున్నట్టు పొడగట్టలేదు. అంతలో అక్కడున్న ఓ ఆడావిడ బజార్లో తాను కొనుక్కొన్న చిట్టిముక్కాలిపీట కూడాకూడా డిసెల్లో పట్టుకుపోతూవున్నది. చేతితో ఆదాకా మోసికొంటూ వున్నది. అగట్టుమీదపెట్టి "కూర్చో అమ్మా! దీనిమీద. నీచీర తెల్లగావుంది" అంది. దిక్కూచి కూర్చుంది ఆపీటమీద. అదివరకు మందంగావున్న తనహాసం అమందంగా! అయితే ఆమెదృష్టి అపీటవేసి కూర్చోమన్న ఆవిడవంకకు లేనేలేదు. అటుపోనేలేదు. అవసరదృష్టీకాదు, అనవసరదృష్టీకాదు అన్నట్టు చూస్తూవుంది.

"ఈ బండిలో ఆడవాళ్ళకు కేటాయింపుగా చోటు వుంచరనుకుంటాను" అని ఎవర్నో అడిగినట్టు అనుకొంటూ పదిమంది మగవాళ్ళవంకా కలయజూచింది. "రైల్వేవాళ్ళుంచకపోయినా నేనుంచుతాను నీకు ప్రత్యేకస్థలం" అన్నట్టు వినిపించుకొన్న పదిమంది మగవాళ్లల్లోను ఓ అయిదుగురైనా అనుకోక తప్పిందిగాదు. ఆమె దృక్కుల్లో అంత చొక్కువుంది.

"అదిగో వస్తూవుంది! అవంపులోవుంది గాడీ!" అన్నాడు

యావత్తూ తుపాకిదెబ్బవింటే పిట్టలు లేచినట్టులేచి "అదేకొంస నాగుతుందా ? ఎంత వేగంగా లోపలకు చొరబడితే అంత మంచిది. సుఖంగా కూర్చోవచ్చు" అనే ఆలోచనలో-అలిని మగడెరుగ నంత, అబ్బాయిని తల్లిమరచే అంత అన్యోన్యం కలగద్రొక్కు కో సాగారు.

"దిక్సూచి" ఎక్కడెక్కిందీ, ఎలాఎక్కిందీ, లోప లెక్క డున్నదీ, కూర్చుందా నించుందా ? అనే గొడవే ఎవరికీ లేక పోయింది. ఎంజిన్ గుడగుడామంటూ తన ఎప్పటి వింత ఈలతో వింత నీలుగుతో గాడీని నడుపుకొంటూవుంది. ఏవంకచూసినా బస్తాకుదేసినంత పట్టుపడి కాపరిచిందిగాడీ. కొందరు కూర్చున్నా అందరూ నిలబడ్డట్టె అగపడ్డారు. బండిలోని ఇనపస్తంభాలట్టుకొని స్త్రీలు పురుషులు అలా నిలబడిపోయి ఒకళ్ళ కొకళ్ళెదురుగా ఒక్కొక్కస్థాయి నలా నిలబడిపోయి బండినడకకు నూగిసలాడి పోతూంటే "ఏంథేనే ఎడ్వేర్సు" అనే చలన చిత్రంలోని డ్యాన్సులావుంది. అసలు చెప్పాలిసొస్తే "డిస్వెడ్యాన్సు" "డిస్వెడ్యాన్సు!"

"దిక్సూచి" ఒక ఇనపస్తంభం పట్టుకు నిలబడి వూగుతూ వుంది. మరి ఆమె అప్పుడి విగ్రహ మెలావుండి వుంటుందో పాఠకులే వూహించుకోండి! కలవపువ్వు గాలికల్లలాడి నట్టందామా? కాదు. మంచుచే కప్పబడ్డదానిమల్లే వున్నాదందామా ? కాదు. ఉల్లోపలిమాటగా తెలువుడు చేసికోందాం. కల్లగాని రూపంతో ఎల్లా మల్లెతీగ పువ్వుల్తో అల్లాడిపోతుందో అల్లా జవజవలాడిపో సాగింది అవశార్ చీరచెంగులోకి చిరునవ్వు లొలుకపోసికొంటూ- స్టేషన్ దగ్గర పడుతూవుందనడంలో గాడీకి క్రమేణ త్వరహరించి పోయేది. ఈమెలోనూ చిరునవ్వు నీరసించిపోయేది. మళ్లీ యంత్రం గుడగుడమనేలో ఈమెకూ జడిమ ఉడిగిపోయేది.

అతడు–ఆ వీరుడు-మందిలో మాయమైపోయినాడు. మంది వంక చూచింది 'దిక్సూచి' మందిలో ప్రతీమనిషి చేతిలోనూ ఆ వీరుని చిరునామాచీటీయే.

గాడి టిక్కెట్టు ఓచేత ఆవీరుని చిరునామాచీటీ వోచేత పెట్టుకొని ప్రతీ ప్రయాణీకుడు ఆపూట ఆ డిసెల్ తుదిగమ్య స్థానంలో దిగినట్టే గోచరించింది 'దిక్సూచికి!'

... ... ... ... ...

## ఇ ది దా ని దే

తెల్లవారింది, వేసంకాలం కావడం చేతను వెంట వెంటనే ఎండకాంతి ఎండకాంతితోపాటు తొందరగా పనులు నెరవేర్చుకోవడము తబ్బిబ్బు ఏకమౌతూ రోడ్డుకడ్డంగా ఒక పదిమంది రిక్షావాళ్ళు తమతమ ఉత్తబళ్ళయొక్క పిడికిటపట్టి కడ్డీలమీద తమతమ చేతులుంచుకు నిలబడివుంటారు ఏమీపనిలేక. వారిలో ఒకడు మాత్రము ఏమరుపాటు నగపించేడు. తనను తన హేండిల్‌బారును తన రిక్షానుకూడా మరిచిపోయాడు. ఆదోరీతిగా ఒక రయిక కాలి మునివ్రేళ్లతో రోడ్డుమీదనుంచి పైకెత్తి తన రెండుచేతులా అర బట్టినట్టు పట్టుకుంటూ ఊం-చూస్తూవున్నాడు దాని గళ్ళకేసి నాణ్యతకేసి.

రోడ్డుమీద వాడికి దొరికిందీ అంటే ఆరోడ్డు ఇంకా తుడువ బడలేదు అన్నమాటే! ఉదయం ఎనిమిది అయితేగాని తుడిచే వాళ్లు రారు. ఆదారినిపోరు. కాని బాటసారులు అపరిమితంగా అప్పటికప్పుడే నడుస్తూవుంటారు. అది మహా జనరస్తా. అస్తమానం వస్తూపోతూనే వుంటారు జనం ముప్పొద్దూ! ఏదో రైలుకని సినిమాకని సరదాకనీ.

అయితే అలా రయిక నేలను పడివుండడం అదే మొదటి సారి ఆదార్ని. ఒకడు పరకాయిస్తుంటే రెండోవాడు! రెండోవాడు